పడి తిడుతుందేమోనని ఎదురుచూశాను. ముఖ్యంగా తనని కాదని ముత్తమ్మదగ్గరికి పోయిన భర్తని దుయ్యపడుతుం దేమో ననుకున్నాను. కాని అలాక్కాదు. చెడిపోయిన కుర్రాడు తప్పిపోతే – వాడిలో మంచితనాన్ని గుర్తుచేసుకు ఏడ్చే తల్లిలాగ – గోల పెట్టింది. మోపుమీద చతికిలబడి కళ్లు ఒత్తుకుంది.

కాస్త ఆగి ఒక ప్రశ్న – ఆ క్షణంలో వెయ్యకూడని దైనా వేశాను—“నాగులు అంటే నీకు కోపంలేదా?”

తెల్లబోయి నావేపు చూసింది. నాగులుగురించి నా కెంత తెలుసో బేరీజు వేస్తోంది గావును.

“నా కంతా తెలుసులే చెప్పు. మీ అమ్మనీ, ముత్తమ్మనీ, అందర్నీ కలిశాను” అన్నాను ధైర్యం చెప్తూ.

“ఆడు మంచోడే బాబూ_అమ్మకి, అన్నకీ వాడు నన్ను సరిగ్గా ఏలుకోలేదని గుర్రు. మా బాధ ఆళ్ళకి తెలీదు. నాకు పిల్లల్లేకపోతే నేనే ఏడవాల. ఆడెందుకు ఏడవాల? ముత్తమ్మ దగ్గరికి పోయాడు. మగాడు. ఆళ్ళకి ఎదురు సెప్పి బతగ్గలవాఁ!”

“అయితే నాగులు ముత్తమ్మ దగ్గరికి పోవడం నీ కిష్టమేనా?”

“ఇష్టంలేకపోతే ఆగుతారా బాబూ-ఆళ్ళు మగాళ్ళు. సూసీసూడనట్టు సద్దుకుపోవాల” అని ముందుకువంగి,

“నే నంటే ఆడికి మనసేబాబూ. నన్నెప్పుడూ ఆడు కొట్టలేదు. ఓ మాటనలేదు. కూడానికివచ్చినా యింటికి చేరే వాడు కాదు—అంతే.”

కనిపించాయి. 'చిత్తూరుకి పదిమైళ్ళ దూరంలో ఒక లారి బోల్తాపడింది. డ్రైవరు పరారయిపోయాడు. లారీమీద కూర్చున్న ఒక 'కూలివాడు' చనిపోయాడు.

నాగులు రాజకీయనాయకుడు కాడు. సాహితీవేత్త కాదు. సంగీత విద్వాంసుడు కాదు. కనీసం ధనవంతుడయినా కాదు. యజమాని దృష్టిలో, పిల్లనిచ్చిన వాళ్ళదృష్టిలో, సుఖాన్నిచ్చిన వాళ్ళదృష్టిలో వాడొక అసమర్థుడు, చేతకాని వాడూను.

కట్టుకున్న పెళ్ళాందృష్టిలో కమ్మని కలలాగ ఉన్నంత మాత్రాన ప్రపంచం గుర్తుంచుకోవలసిన అవసరమేమీ లేదు.

—జ్యోతి, దీపావళి ప్రత్యేకసంచిక, 1968.